# వర్షించని మేఘం

భమిడిపాటి భాస్కర రామారావు

హాల్లో మడత కుర్చీలో కూచుని ఉన్నాడు కుటుంబరావు అతడి ముఖం మ్లానంగా ఉంది అదే హాల్లో ఓ మూల చాప మీద కూర్చుని ఎంబ్రాయిడరీ చేస్తోంది అరుణ అరుణ కుటుంబరావుకు ఆరో సంతానం నాలుగో కూతురు వయసు పద్దెనిమిది చిదిమి దీపం పెట్టవచ్చు నన్నంతటి అందం ఆమె సంపద

పొగలు గక్కుతున్న కాఫీ గ్లాసుతో హాల్లోకి వచ్చింది కాంతమ్మ కాంతమ్మ కుటుంబరావుకు వేలు విడిచిన పినతండ్రి కూతురు అతి పిన్న వయసులోనే పెండ్లయింది కాంతమ్మకు భర్తతో కాపురానికైనా వెళ్లకుండానే వైధవ్యం దాపురించింది నా అన్న దిక్కు లేని కాంతమ్మను చేరదీసి తన యింట ఆశ్రయం కల్పించాడు కుటుంబరావు

కాంతమ్మ కాఫీ గ్లాసు కుటుంబరావుకు అందించింది అతడు మధ్య మధ్య ఊదుకుంటూ కాఫీ త్రాగసాగాడు

అన్నయ్యా! తొందరపడకు అరుణకు యింకా పద్దెనిమిదేండ్లైనా నిండలేదు మొన్న పిల్లను చూచి వెళ్లిన పెళ్లికొడుకు ఉమామహేశ్వరరావు ద్వితీయం వాడు ద్వితీయం అన్నదానికి ఎలాగో ఓలా సరిపెట్టుకుందామన్నా బొత్తిగా వయసు మీరినవాడు

మధ్యవర్తులు అతడికి యింకా నలభయి ఏళ్లయినా నిండలేదని చెబుతున్నా నా మటుకు నాకు అతడికి యాభయికి పైగానే ఉంటాయని పిస్తోంది' అంది కాంతమ్మ

కుటుంబరావు కాఫీ త్రాగుతూనే, 'కాంతం' నా ప్రస్తుత పరిస్థితి నీకు మాత్రం తెలియదా! ముక్కు పచ్చలారని అరుణను ఒక వృద్ధుడికిచ్చి కట్టబెట్టడం నాకు మాత్రం యిష్టమా చెప్పు? ఏం చెయ్యను? చెప్పుకుందుకు ఇద్దరున్నారు కొడుకులు కాని ఏం లాభం? వాళ్ళు వాళ్ల స్వార్థమే చూచుకుంటున్నారు తప్ప ఇక మిగిలిన ఒక్క చెల్లెలి పెళ్లి చెయ్యడంలో తమకూ బాధ్యత ఉందన్న ఇంగిత జ్ఞానం కూడా వాళ్లకు లేకపోయె వాళ్ల కోసం తన సర్వస్వాన్ని ధారపోసిన తండ్రి ఉన్నాడో చచ్చాడో చూడాలన్న ధ్యాస కూడా లేదు వాళ్లకు ఇక చెల్లెలి పెళ్లికి ముందుకు వస్తారా 'చెప్పు'

నా ఆరోగ్యమా నానాటికీ క్షీణిస్తోంది ఈ దేహ పంజరం నుండి హంస ఎగిరిపోయేలోగా నా చిన్నారి అరుణను ఒక అయ్య చేతిలో పెడితే అతడికి దుఃఖం తన్నుకు వస్తోంది

ఆ దుఃఖాన్ని కూతురు అరుణ, చెల్లెలు కాంతమ్మ చూడడం ఇష్టం లేదతడికి అందుకే మాట పూర్తి చేయకుండానే లేచి బయటకు వెళ్లాడు కుటుంబరావు

అంతవరకూ కాంతమ్మత్తకూ తన తండ్రికీ మధ్య జరిగిన సంభాషణకు మూగ సాక్షి అరుణ!

కాంతమ్మ నుద్దేశించి, అత్తయ్యా! నాన్న మనసుకు బాధ కలగనివ్వకు ఏదో విధంగా నా బరువు తీరితే నాన్నకూ నిశ్చింత ఏమో? నా అదృష్టం ఎలా ఉందో! అంది అరుణ

'అరుణా' నీకు తెలియదమ్మా! మా నాన్న కూడా యిలాగే ఏదో రకంగా నా బరువు దించుకోవాలనే తపనతో నాకంటే నాలుగు రెట్లు వయసున్న ఆయనకిచ్చి నా పెళ్లి జరిపించాడు కనీసం నేను పెద్దమనిషి కూడా అవకుండానే ఆయన హరీమన్నారు అదో పెద్ద ఆపద అనుకునేంత వయసు కూడా లేదు నాకప్పటికి

కాస్త నాకు జ్ఞానం తెలిసి వచ్చేసరికి మా నాన్న కూడా గతించాడు నాకు నిలువ నీడ కూడా లేకపోయింది ఇరుగు పొరుగులు నా వయసు పాలిట రాబందులై పోయారు ఇక ఆ ఊళ్లో ఉండడం కూడా నా పాలిటికి ప్రమాదంగా పరిణమించింది

పోనీ అని ఎక్కడికి వెళ్లే దిక్కు కూడా లేదు

అలాటి సమయంలో మీ నాన్న వచ్చి దేవుడిలా ఆదుకున్నాడు ఇక్కడకు తీసుకొచ్చి మీ యింట్లో ఆశ్రయం కల్పించాడు దానితో నా బ్రతుక్కు భద్రత ఏర్పడింది

మీ నాన్నది వట్టి జాలి గుండె ఎప్పుడూ ఎదుటి వాళ్ల కష్ట సుఖాల గురించే తప్ప తన గురించి పట్టించుకుని ఎరగడు అలాకాక మొదటి నుంచి తన గురించి తన భవిష్యత్తు గురించి ఆలోచించే వాడయితే ఈనాడు యిలాటి, దయనీయమైన స్థితిలో ఉండేవాడా! అతడికి తగ్గట్టు మీ అమ్మకూడా అలాటి సత్యకాలం మనిషే! కనకనే మీ పెద్ద నాన్నగారి పిల్లలు యివాళ ఎంతో ఉచ్చస్థితిలో ఉన్నారు మీ అప్పచెల్లెళ్లకూ అన్నదమ్ములకూ కూడా ఆనాటి మీ కుటుంబ స్థితి తెలియదు కాంతమ్మ చెప్పసాగింది

'గంగాధరంగారు పెద్ద భూస్వామి జమీందారీ ఫాయాలో నడిచేది ఆయన జీవితం యాభయి ఎకరాల మాగాణీ, పాతిక ఎకరాల కొబ్బరి తోటకూ ఆయన అధిపతి

ఆనందరావు, కుటుంబరావులు యిద్దరే ఆయన సంతతి ఆనందరావుకూ కుటుంబరావుకూ మధ్య పదేళ్ల వార

గంగాధరంగారు వృద్ధులయ్యేటప్పటికి ఆనందరావుకు పెళ్లయింది అప్పటికి కుటుంబరావు వయసు పదిహేనేళ్ళు

ఆనందరావుకు ఇద్దరాడ పిల్లలు పుట్టేటప్పటికి గంగాదరంగారు వైకుంఠ ధామానికి చేరుకున్నారు అప్పటికి కుటుంబరావు వయసు పదిహేడేళ్ళు

కుటుంబరావుకు ఇరవై నాలుగేళ్ల ఈడులో పెళ్లయింది అప్పటికి ఆనందరావుకు ఆరుగురు సంతానం ఆరుగురూ ఆడ పిల్లలే!

కుటుంబరావుకు పెళ్లయిన సంవత్సరంలోగానే ఆనందరావు పెద్ద కూతురు పెళ్లి చేశాడు అదీ పెద్ద జమీందారీ సంబంధం చూసి ఆ పెళ్లి జరిపించింది కూడా అలా యిలా కాదు ఆకాశమంత పందిరీ, భూమంత అరుగూ అన్నంత అట్టహాసంగా చేశాడు అయిదు రోజుల పెళ్లి ఆ అయిదు రోజులూ ఏ పూటా గ్రామంలో ఎవరి యింటా వంటలేదు అంత ఘనంగా చేశాడు సంతర్పణ లు

ఆనందరావు రెండో కూతురి పెళ్లినాటికి కుటుంబరావుకు మొదటి సంతానం కలిగింది ఆ సంతానం కూడా మగబిడ్డ అన్నదమ్ముల కుటుంబాల్లో మొట్టమొదటి మగనలుసు కావడంతో బారసాల నామకరణాది కార్యక్రమాలు కూడా చాలా ఘనంగానే జరిగాయి

అప్పటికి అన్నదమ్ములిద్దరిదీ అవిభక్త కుటుంబంగానే నడుస్తోంది

అయితే ఆనందరావు జమీందారి ఫాయాలతోటీ, ఆడపిల్లల పెళ్లిళ్ల ఆడంబరాలతోటీ, వాళ్ల ఆస్తి మాత్రం 'నానాటికీ తీసికట్టు నాగం భట్టూ' అన్న చందమవసాగింది

కుటుంబరావు కొడుకు తరువాత మరో యిద్దరు ఆడపిల్లలు ఓ కొడుకూ పుట్టారు ఆలోగా ఆనందరావు కూతుళ్లు మరో యిద్దరికి పెళ్లిళ్లయ్యాయి.

అప్పటికి వారికి మిగిలిన ఆస్తి పదిహేనెకరాల మాగాణీ పదెకరాల కొబ్బరితోట

ఊళ్లో ఉండే కొందరు పెద్దలు పరిస్థితి గమనించారు ఆనందరావు బరువు బాధ్యతలు తరుగుతున్నాయి కుటుంబరావు సంతానం యింకా చిన్న పిల్లలు!

కుటుంబరావు పిల్లలు ఎదిగి వచ్చే వేళకు చిప్పా కర్రా చేతికి వస్తుందనడంలో సందేహం ఏమీలేదన్న నిర్ధారణకు వచ్చారు

కుటుంబరావుకు అన్నతో ఆస్తి పంచుకోమని చెప్పి చూచారు రాముడికి లక్ష్మణుడిలా అన్న సంతకం పెట్టమన్న చోటునల్లా మారు మాటాడకుండా సంతకం పెట్టడం నేర్చిన కుటుంబరావుకు వారి పలుకులు ములుకులయ్యాయి అన్నగారితో ఆస్తి పంపకం చేసుకుందుకు యిష్టపడలేదు

బుద్ధిః కర్మానుసారిణీ! అని ఊరుకున్నారు పెద్దలు

ఈలోగా అన్నగారి కూతుళ్లకు సారెలనీ, చీరలనీ – పండుగలనీ పబ్బాలనీ – పురుళ్లనీ, పుణ్యాలనీ ప్రతి రోజూ యిల్లు పెళ్లి యిల్లులాగే నడుస్తోంది

ఆస్తి కూడా గాలిలో ఉంచిన హారతి కర్పూరంలా హరించి హరించి పదెకరాల మాగాణీ, అయిదెకరాల కొబ్బరి తోటగా కుదించుకు పోయింది

కావలసిన వాళ్లందరూ పోరగా పోరగా ఎలాగైతేనేం చివరకు కుటుంబరావు ఆస్తి పంపకాలకు ఒప్పుకున్నాడు

అయిదెకరాల మాగాణీ, రెండున్నర ఎకరాల కొబ్బరి తోట, ఒక యింటితో కుటుంబరావు ఉమ్మడిలోంచి వేరు పడ్డాడు

అప్పటికి కుటుంబరావు కుటుంబానికి మరో యిద్దరు ఆడపిల్లలు పుట్టి కలిశారు

వెరసి నలుగు రాడపిల్లలకు ఇద్దరు కొడుకులకు



తంత్రయాడు కుటుంబరావు తన పేరును సార్ధకం చేసుకుంటూ

పెద్ద కొడుకు శంకరం చదువుకు ఎదిగి వచ్చాడు వ్యవసాయమే తప్ప వేరే విద్య ఏమి తెలియదు కుటుంబరావుకు

శంకరం డిగ్రీ చదువులో ఉండగానే పెద్ద కూతురు రుక్మిణికి పెళ్ళి చేశాడు కుటుంబరావు అల్లుడు కేశవరావు బ్యాంక్‌లో గుమాస్తా

శంకరం డిగ్రీ పూర్తయి నాటికి రెండవ కూతురు లక్ష్మికి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో క్లర్క్‌గా పని చేస్తున్న సూర్యనారాయణతో వివాహం జరిపించాడు కుటుంబరావు

శంకరం బి యస్ సి యూనివర్సిటీ ఫస్టు ర్యాంకులో ప్యాసయ్యాడు యూనివర్సిటీలో చేరి చదవాలని సరదా పడ్డాడు

శంకరం చదువు నిమిత్తమయితేనేమి, కూతుళ్ళ పెళ్ళిళ్ళ నిమిత్తమయితే యేమి కుటుంబరావు కాస్త కాస్తగా ఆస్తి అమ్మి నెట్టుకుంటూ వస్తున్నాడు ఉన్న ఆస్తి ఎలాగూ కరిగి పోతోంది కేవలం బి యస్ సి తో చెప్పుకోదగ్గ ఉద్యోగం ఎలాగూ రాదు

యమ్ యస్ సి. చేస్తే తను తిని తనకు కూడా సాయపడగల స్థితికి ఎదిగి వస్తాడు కొడుకు మహాఅయితే మరో ఎకరం భూమి అమ్మవలసి వస్తుంది కొడుకు మంచి ఉద్యోగం సంపాదిస్తే అలాటి ఎకరాలు మరిన్ని సంపాదించ వచ్చు. ఆ ఉద్దేశ్యంతోనే శంకరాన్ని యూనివర్సిటీలో చేర్పాడు కుట[illegible]రావు

శంకరం చదువు పూర్తయింది. కేంద్ర ప్రభుత్వంలో చక్కని ఆఫీసరు ఉద్యోగం కూడా వచ్చింది

అప్పటికి రెండవ కొడుకు సూర్యం డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉన్నాడు. మూడో కూతురు మంగ పెళ్ళికి ఎదిగి వచ్చింది

శంకరానికి అప్పటికి ఉద్యోగం వచ్చిన కొత్త తండ్రికి సాయం అందించగల సత్తా యింకా రాలేదని భావించిన కుటుంబరావు మరికొంత భూమి

# వర్షించని మేఘం

అమ్మి మంగ పెళ్ళి చేశాడు అల్లుడు భీమశంకరం బి యిడి. టీచరు

అప్పటికి యిక కుటుంబరావుకు మిగిలిన ఆస్తి ఒకేఒక్క ఎకరం అదీ కాస్త నాసిరకం మాగాణి

శంకరానికి పెళ్ళి చేసి వచ్చే కట్నంతో నాలుగో కూతురు అరుణ పెళ్ళి. రెండో కొడుకు సూర్యం డిగ్రీ పూర్తి చేయించవచ్చునని ఆశించాడు కుటుంబరావు

శంకరం మరి కొన్నాళ్ళు ఉద్యోగంలో నిలదొక్కుకుంటేనే గాని వివాహం చేసుకోనన్నాడు అప్పటి ఆన ఆర్థిక పరిస్థితిని, యింకా తాను నెరవేర్చవలసిన బాధ్యతల గురించి శంకరానికి నచ్చ చెప్పబోయాడు కుటుంబరావు.

శంకరం ససేమిరా అన్నాడు

పైగా తగిన స్తోమతు లేనిదే అంత మంది సంతానానికి జన్మ నివ్వడం ఎందుకని కూడా అడిగాడు

తన తాలూకు పూర్వకాలపు ఛాందసానికి తనను తానే నిందించుకున్నాడు తప్ప కొడుకును పల్లెత్తు మాట అనలేదు కుటుంబరావు

ఉన్నంతలోనే సూర్యం చదువుకు ఏ విధమయిన ఆటంకమూ కలగకుండా చూస్తున్నాడు ఆ పిచ్చి తండ్రి

అయినా తన అవసరాలకు సరిపడా సొమ్ము యివ్వడం లేదని మధ్య మధ్య సూర్యం అలక

అటు శంకరం సహాయనిరాకరణ

ఇటు సూర్యం ఆగ్రహం ఈసడింపులూ

పెళ్ళీడు వచ్చిన అరుణకు వివాహం చెయ్యలేక పోతున్నానన్న మనోవ్యథ

పంచాగ్ని మధ్యమై పోయింది కుటుంబరావు బ్రతుకు.

శివుడు హాలాహలాన్ని మింగినట్టు వాటి నన్నిటిని కంఠగతం చేసుకుంటున్నాడు కుటుంబరావు

ఒక్కొక్క రోజు యిల్లు గడవడం కూడా కష్టమై పోతోంది ఆ యింటి వంటమనిషిగా స్థిరపడి పోయిన వేలు విడిచిన చెల్లెలు కాంతమ్మ అలాటి సమయంలో తాను కూడా కుటుంబరావు మెడకు ఓ గుదిబండలా తయారయ్యానేమోనని విచారించ సాగింది మనసులో

కుటుంబరావు దర్జాగా కాలం వెళ్ళబుచ్చుతున్న రోజులలో అనాథగా ఆ యింట అడుగు పెట్టి తానూ ఎంతో సుఖం అనుభవించింది కాంతమ్మ ఆ యింటిలో ఇప్పుడు కుటుంబ యజమాని కష్టాల ఊబిలో పీకల దాకా కూరుకుని పోయి ఉన్నాడు అలాటి కష్ట సమయంలో తాను వేరే ఎక్కడికయినా వెళ్ళిపోతానంటే తను కూడా అతడిని చులకన చేస్తున్నానని బాధపడతాడేమోనని ఆమె మనసులో మథనపడ సాగింది అందుకే కొన్ని కొన్ని పూటలు తాను పస్తులయినా ఉంటూ యిల్లు చక్కదిద్దుకుని వస్తోంది కాంతమ్మ

ఈలోగా సూర్యం డిగ్రీ పూర్తయింది అది కూడా ఫస్టు క్లాసులో తానూ యూనివర్సిటీలో చేరుతానన్నాడు సూర్యం

కాని ఎలా?

అప్పటికే కుటుంబరావు ఆర్థికంగా చితికి పోయాడు

అరుణ పెళ్ళికి ఎదిగింది

జీవితంలో స్థిరపడ్డ పెద్ద కొడుకు శంకరం ఏ సహాయమూ చేయడంలేదు సరికదా తనపై అధికారి కూతురును ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు

కుటుంబరావు ఆస్తిపాస్తులున్నరోజులలోనే ఎప్పుడూ అప్పుచేయలేదు ఇక వున్న ఆస్తి హరించుకుపోయిన ఆ రోజులలో ఎవరూ అప్పు యివ్వడానికి ముందుకు రాలేదు

తన నిస్సహాయస్థితిని సూర్యం ముందు వెళ్ళబోసుకున్నాడు కుటుంబరావు

సూర్యానికి తండ్రి పట్ల జాలికలగలేదు పైగా ఆగ్రహం వచ్చింది

అన్నకు కోరినంత చదువూ చెప్పించి తనదగ్గర వచ్చేసరికి నీతి వాక్యాలు వల్లిస్తున్నావా అని తండ్రిని ఈసడించాడు


ఒక మిత్రుడి సాయంతో ఏదో ఉద్యోగం సంపాదించుకుని యిల్లు విడిచిపెట్టి వేరే వెళ్ళిపోయాడు

పెదనాన్నాగారు నాన్న ఉమ్మడి కుటుంబంగా ఉన్న నాటి సంగతులు నాకు తెలియకపోయినా అన్నయ్యల చదువు, అక్కయ్యల పెళ్ళి వివరాలూ నాకు తెలుసునత్తయ్యా

పెద్దన్నయ్య నాన్నకు ఏరకంగానూ సాయం చెయ్యడంలేదు చిన్నన్నయ్య కూడా తన దారి తాను చూచుకుని వెళ్ళిపోయాడు దానితో నాన్న ఆరోగ్యం బాగా క్షీణించింది

ఇలాంటి పరిస్థితులలో యింతకన్న మంచి సంబంధం నాన్న మాత్రం ఎలా తేగలడు? ఎవరి మొగాన ఏం వ్రాసివుందో ఎవరు చెప్పగలరు?

ఇక నువ్వేం అడ్డు చెప్పకత్తయ్యా నాన్నకు నా పెళ్ళి చేశానన్న తృప్తైనా మిగలనియ్యి అంది అరుణ అనుభవం తెచ్చిన ఆరిందాతనంతో



కాంతమ్మ ఏమీ అనలేకపోయింది

ఉమామహేశ్వరరావుతో అరుణ పెళ్ళి అయిపోయింది అదీ చాలా నిరాడంబరంగా

ఉమామహేశ్వరరావుకు పెద్దగా చదువులేదు కోమటికొట్లో నాలుగిటిలో పద్దులు రాస్తూ, నాలుగు రాళ్ళు తెచ్చుకుంటున్న సామాన్యవ్యక్తి అతడికి ప్రథమ కళత్రం ద్వారా సంతతి లేకపోవడం ఒక్కటే చెప్పుకోదగ్గ విశేషం

మామగారింటికి మకాం మార్చి ఆయనకు వచ్చే ధాన్యం గింజలకు తోడు తాను తెచ్చే నాలుగు రాళ్ళూ చేర్చి జీవితం వెళ్ళమారుస్తున్నారు. కుటుంబరావు, కాంతమ్మ, అరుణ, ఉమామహేశ్వరరావులు

ఉమామహేశ్వరరావు సర్వవిధాలా ఆరోగ్యవంతుడే! కాని వర్షరుతువు తిరిగేసరికి ఉబ్బస వ్యాధికి గురవుతూంటాడు

ఎన్నిరకాల చికిత్సలు చేయించినా వ్యాధి ఏమాత్రం తగ్గలేదు.

నోటికి చేతికి అద్దురాకుండా ఏదో విధంగా రోజులు గడుస్తున్నాయి

అరుణ గర్భవతి అయ్యింది

కుటుంబరావు, కాంతమ్మ, ఉమామహేశ్వరరావుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి

ఉమామహేశ్వరరావయితే అరుణను కాలు కింద మోపనివ్వడం లేదు

కాంతమ్మ సరేసరి

ఇంట్లో ఆనంద వాతావరణం నెలకొంది దానితో కుటుంబరావు ఆరోగ్యం కొంత కుదుటపడింది

రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి అరుణ సహజంగానే చాలా అందగత్తె గర్భం ఆమెలో మరింత సోయగాన్ని తెచ్చిపెట్టింది ఉమామహేశ్వరరావు కూడా తనకు వంశాంకురం కలగబోతున్నందుకు మహదానందం పొందుతున్నాడు

వారి ఆనందంలో తానూ పాలువంచుకుంటున్నాను సుమా అన్నట్టు తూరుపుదిక్కున చిన్నమేఘం లేచి క్రమంగా నింగినంతా ఆవరించి పుడమి తల్లి పులకించేటట్టు అమృతధారలను కురిపించసాగింది

ఆ వర్ష మేఘం తన ఆనందాన్ని వారికి పంచిపెడుతున్నాననుకుందేతప్ప తన అమృత ధారలు వారిపట్ల హాలాహలమై వారిని దుఃఖ ధారంలో ముంచెత్తబోతున్నాయని తెలుసుకోలేకపోయింది

ఉమామహేశ్వరరావుకు ఉబ్బసం ప్రకోపించింది ఎప్పటివలె మందులతో తనదారి తాను చూచుకోలేదు తనతో బాటే ఉమామహేశ్వరరావును కూడా తీసుకుపోయింది

పూర్ణగర్భిణి అయిన అరుణకు అది అఘాతమే అయింది ఆమె ఆత్మహత్యకు పాల్పడకుండా చూచుకోవడం కాంతమ్మకు పెద్ద సమస్యే అయింది

అరణ కళ్ళు వర్షమేఘాలే అయాయి

మింటికి మంటికి ఏకధారగా వర్షధారలు

కుటుంబరావు గుండె కూలబడినట్టయింది

కొడుకులకూ, కూతుళ్ళకూ టెలిగ్రాములు యిప్పించాడు

వారినుండి కేవలం సానుభూతి సందేశాలే వచ్చాయి

కుటుంబరావు గుండె కూడదీసుకుని అల్లుడి కర్మకాండలు పూర్తిచేశాడు

అరుణ గర్భంలోని బిడ్డను తలుచుకుంటూ అరుణిమను కోల్పోయిన సాయం సంధ్యలా రోజులు గడుపుకునివస్తోంది

ఓ నాటి అర్ధరాత్రి

అరుణకు పురిటి నొప్పులు మొదలయ్యాయి గిలగిలలాడిపోతోంది సాయంత్రం నుండి ఆకాశం అంతటా జీమూతాల్లా కమ్ముకుని వున్న మేఘాలు ప్రళయభీకరంగా వర్షించసాగాయి.

అసలే సుకుమారి అయిన అరుణ పురిటినొప్పులకు తట్టుకోలేకపోతోంది ఉన్న ఆడతోడల్లా అప్పటికే వృద్ధాప్యదశలోకి అడుగుపెడుతున్న కాంతమ్మ బయటకుపోయి డాక్టరును తెచ్చే ఓపికలేని స్థితి కుటుంబరావుది

యమయాతనపడి ప్రసవించింది అరుణ పనస పండులాంటి మగబిడ్డ తన బిడ్డను కనులారా చూచుకోనైనాలేదు అరుణ

నిస్త్రాణగా కనులు మూతలు పడ్డాయి

చేతనయిన సపర్యలుచేస్తోంది కాంతమ్మ.

అరుణకు ఎగశ్వాస ఆరంభమయింది

కాంతమ్మ కంగారుపడింది కుటుంబరావును వెంటనేవెళ్ళి డాక్టరును ఎవరినైనా వెంటబెట్టుకుని రమ్మంది

కుటుంబరావుకు కన్ను సరిగా ఆనదు కాలు సరిగా సాగదు అయినా ముందున్న సమస్య కన్నబిడ్డ ప్రాణం! ఎలాగో దేవుకుంటూ ఆ అర్ధరాత్రి, ఆ కుంభవృష్టిలో బయలుదేరాడు


డాక్టరును వెంటబెట్టుకునివచ్చాడు

కాని ఏం లాభం?

అప్పటికే అరుణలోని ప్రాణవాయువు అనంత వాయువులో కలిసిపోయింది

చేసేదేమీలేక ఫీజయినా పుచ్చుకోకుండా వెనుదిరిగాడు డాక్టరు

కుటుంబరావు చైతన్యరహితంగా మంచంమీద కూలబడ్డాడు




తెల్లవారింది

కుటుంబరావు పరిస్థితి తెరిపి మరపులుగావుంది మధ్య మధ్య ఏవేవో కలవరిస్తున్నాడు

కాంతమ్మ అందరికీ టెలిగ్రాములు యిప్పించింది

శంకరం—అతడికుటుంబం, సూర్యం, కూతుళ్ళు రుక్మిణి, లక్ష్మి, మంగ తమతమ కుటుంబాలతో దిగారు

అన్నయ్యా! అన్నయ్యా! పిల్లలంతా వచ్చారు కుటుంబరావును కుదిపి కుదిపి చెప్పింది కాంతమ్మ

కుటుంబరావు అతి కష్టంమీద కళ్ళు తెరిచాడు

ఎదురుగా తనవారందరూ కనిపించారు

తృప్తితో కళ్ళు మిలమిల మెరిశాయి

అదెంతసేపు?

ఒక్కక్షణం!

మరుక్షణంలోనే కుటుంబరావు కళ్ళు మూతలు పడ్డాయి

అవి మరి తెరుచుకోలేదు

తండ్రికి, చెల్లెలికి అంత్యక్రియలు నిర్వర్తించారు కొడుకులు

కనులైనా తెరవని పసికందుతో అవస్థపడుతోంది కాంతమ్మ

అప్పుడు చర్చ లేచింది

"ఒరే అన్నయ్యా! ఈ బిడ్డను నువ్వు తీసుకవెళ్ళి పెంచరాదురా?" అడిగింది రుక్మిణి

శంకరం ఏమనునో!

ఈలోగా అతడి భార్య కలగజేసుకుని, "ఏం? అంత ప్రేమ ఒలికిపోతూంటే మీరే తీసుకెళ్ళచ్చుగా?" అంది

రుక్మిణి ఏమో అనబోతోంది ఇంతలో ఆమె భర్త కేశవరావు కలగజేసుకుని "దిక్కులేని పిల్లలందరినీ చేరదీసి పెంచడానికి నా యిల్లేమీ అనాథశరణాలయం కాదు" అన్నాడు ముఖం మురకటించుకుంటూ

మిగిలిన అక్కచెల్లెళ్ళు వారి భర్తలవైపు చూచారు

భర్తలు భార్యలవైపు చూచారు

కళ్ళతోటే సంభాషించుకున్నారు వారందరూ

వారందరూ కూడా రుక్మిణీ-కేశవరావుల అభిప్రాయమే తమదీను అన్నట్టు మౌనంగా చూస్తూ వుండిపోయారు

జరుగుతున్న బాగోతం అంతా గమనిస్తూనే వుంది కాంతమ్మ

అప్పటికింకా ఏ అభిప్రాయమూ చెప్పకుండా మిగిలినవాడు సూర్యమే!

అతడు వెకిలిగా నవ్వుతూ అందరిదీ అదే అభిప్రాయం అయినప్పుడు నేను మాత్రం వేరే ఏమంటాను? అనాథశరణాలయంలోనే చేరుద్దాం! అని బిడ్డవైపు అడుగువేయబోయాడు

వారి నీచబుద్ధి చూచి కాంతమ్మ కడుపు ఉడికింది కోపం తారాస్థాయికి చేరుకుంది

అప్పటికి సూర్యం బిడ్డ వున్న మంచాన్ని సమీపించాడు ఒంగి బిడ్డను అందుకోబోయాడు

ఆగు! బిడ్డ ఒంటి మీద చేయి వేశావంటే మాట దక్కదు కాళికలా గర్జించింది కాంతమ్మ

హఠాత్పరిణామానికి సూర్యం స్థాణువైపోయాడు

అందరూ రాతి బొమ్మల్లా చూస్తూండిపోయారు

కాంతమ్మ వెళ్ళి పొత్తిళ్ళలోని బిడ్డను అద్దాలతో వేసుకుని, వారివైపు తిరిగి 'దౌర్భాగ్యుల్లారా! రక్తం పంచుకుని పుట్టినవాడికి మీరు చేసే నిర్వాకం యిదట్రా! మీరెవరూ వీడిమీద జాలి ఒలకవొయ్యనక్కరలేదు వీడిని నేను పెంచుతానట్రా! నేను పెంచుతాను అంది

# ప్రయాణం

ప్రయాణం ప్రారంభిస్తూ తానేడుస్తాడు
దిగిపోతూ తనవారి నేడిపిస్తాడు
ఏడుపుకూ ఏడుపుకూ మధ్య
నడవ లేనంత దూరం నడుస్తాడు
మోయలేనంత బరువు మోస్తాడు
దూరాన్ని జీవితం అంటాడు
భారాన్ని అనుభవం అంటాడు
దూరాభారాల మధ్య దాహం తీరక
ఎండమావుల కోసం మళ్ళీ ఏడుస్తాడు
ఏడుస్తూ, కాళ్ళీడుస్తూ
ముందుకు పోతున్నాననుకుంటూ వెనక్కు నడుస్తాడు
ఎటు నడిచినా వచ్చేది ఒక్కటే
అజ్ఞానం చీకటి గుహ!
అది తెలిస్తే మరింత నిరీహ!

—కొండముది శ్రీరామచంద్రమూర్తి

# వర్షించని మేఘం

ఆమె ఆవేశంతో వారిలో చైతన్యం వచ్చింది

ఆహా! ఏం చెప్పిందండీ! ఇన్నాళ్ళూ దిక్కులేక మా యింట్లోపడి మేసింది ఇది పెంచుతుందట పెంచుతుంది! అవహేళనగా అన్నారు

ఆమె సంరక్షణ వల్లనే తాము పెరిగామన్న జ్ఞానం లేకపోయింది వారికి ఆ సమయంలో

నలుగురూ నాలుగు మాటలతో కాకుల్లా పొడవసాగారు కాంతమ్మను

కాంతమ్మ ఒక్కక్షణం నిర్ఘాంతపడిపోయింది

తాను తొందరపడుతోందా! ఈ బరువు ఎత్తుకోగలదా! వాళ్ళందరూ భయపడే ఈ బరువును ఎత్తుకోవడం మానేశారా!

కాని

ఈ బిడ్డ ఏం కావాలి?

బిడ్డవైపు మరోసారి చూచింది కాంతమ్మ

అమాయకపు శిశువు

అన్నెం పున్నెం-పాపం పరమార్థం-ఏ కల్మషం తెలియని అమాయక శిశువు!

ఈ శిశువు ఏం కావాలి?

వీళ్ళ మాటలకు ఏంకావాలి?

కాకుల్లా పొడుస్తున్నారు

కాంతమ్మ వాళ్ళకు అవకాశం యివ్వదలుచుకోలేదు మరెక్కడైనా వంటకు కుదురుకుంటే వీడిని పెంచడం సమస్య కాదనుకుంది ఒక నిర్ణయానికి వచ్చింది

వాళ్ళవైపు కన్నెత్తి అయినా చూడకుండా అద్దాలలోని బిడ్డతో యింటి గుమ్మం దాటింది కాంతమ్మ

కాకులు నిర్ఘాంతపోయి చూస్తున్నాయి □


LOANS LOANS LOANS LOANS LOANS LOANS

# LOANS

LOANS LOANS LOANS LOANS LOANS LOANS



AVAILABLE LOANS EVEN WITHOUT MORTGAGE / PLEDGE / GUARANTORS. FOR LOAN FORMS AND GUIDANCE-BOOKLET, REMIT Rs. 100/- BY M.O. / I.P.O. / D.D. TO :



**Satna Syndicate Banker**

SATNA—485001 (M.P.)

NOTE—Deposits shall not be accepted.



నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్కలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స! పోస్టు ద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" : ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6-30 గం. వరకు, ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

## డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేద భిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్,

పార్కురోడ్, గుడివాడ - 521301

ఫోన్స్ : 522 & 540